హైదరాబాద్ వార్త



## టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి : ఈటెల రాజేందర్



మీడియాతో మాట్లాడుతున్న ఈటెల రాజేందర్

**సైదాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బిజెపి నాయకులు ఈటెల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చంచల్‌గూడ జైలులో ఉన్న బిజెవైఎం నాయకులను పరామర్శించిన అనంతర ం ఆయన మీడియాతో మాట్లాడుతూ టిఎస్‌పిఎస్‌సి దొంగలకు, బ్రోకర్లకు నిలయంగా మారిందని, వెంటనే టిఎస్‌పిఎస్‌సిని రద్దు చేసి దాని స్థానంలో నిపుణులను నియమించాలని ఆయన కోరారు. దోషులను తక్షణమే శిక్షించాలని, వెంటనే పరీక్షలను నిర్వహించి ఉద్యోగాల భర్తీని పూర్తి చేయాలని సిట్‌లపై తమకు నమ్మకం లేదని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. యువత జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందన్నారు.

## బిసిల కులగణనపై ఏప్రిల్ 3,4 తేదీల్లో ఛలో ఢిల్లీ

### -బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి. ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, మార్చి 27,ప్రభాతవార్త:** జనగణనలో బిసి కులగణన చేపట్టాలని ఏప్రిల్ 3,4 తేదీల్లో ఛలోఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి. ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈమేరకు విద్యానగర్‌లో బిసి యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగబోయిన రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హలోబిసి -ఛలోఢిల్లీ పోస్టర్‌న్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణనలో భాగంగా బిసిల కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బిసిలు ఓట్లు వేస్తేనే ఎంపిలు, కేంద్రమంత్రులు, ప్రధానమంత్రులు అఆయ్యారని గుర్తుచేస్తూ అన్ని రాజకీయ పార్టీలు బిసిలను ఓట్లేసే యంత్రాలుగానే వాడుకుంటున్నాయన్నారు. 75 సంవత్సరాలుగా బిసిలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. బిసిడిమాండ్ల సాధనకు వేలసార్లు జంతర్‌మంతర్ వేదికగా ధర్నాలు,ర్యాలీలు, ముట్టడిలు నిర్వహిస్తున్నామని డిమాండ్లను సాధించుకునే వరకు ఉద్యమిస్తూనే ఉంటామని బిసిల ఓట్లు కావాలని కానీ బిసిల డిమాండ్లు పట్టించుకోరా అని కృష్ణయ్య ప్రశ్నించారు. యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాంబాబు మాట్లాడుతూ బిసిల డిమాండ్ల సాధనకు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగే పార్లమెంట్ ముట్టడికి వేలాదిగా బిసిలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, ఎర్ర సత్యనారాయణ, నీలం వెంకటేష్, జిల్లపల్లి అంజి, వేముల రామకృష్ణ, జి.అనంతయ్య, వెంకటేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, రాంబాబు తదితరులు

# వంట గ్యాస్ కష్టాలు ..!

**-వాణిజ్య అవసరాలకు ఫుల్..గృహాలకు నిల్**

**-కృత్రిమ కొరత సృష్టిస్తున్న గ్యాస్ ఏజెన్సీలు**

**-ఆన్‌లైన్ బుకింగ్ చేసినా ..సమయానికి అందించని వైనం**



**హైదరాబాద్,మార్చి 27,ప్రభాతవార్త:** గతకొన్ని రోజులగా రాజధాని నగరంలో సిలిండర్ల కొరత ఏర్పడుతోంది. ఇదివరకు బుకింగ్ చేసిన రెండురోజుల్లో వచ్చే సిలిండర్ ప్రస్తుతం పదిరోజులైనా రాకపోవడంతో వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. సిలిండర్ ఎప్పుడొస్తుందని డీలర్లుకు ఫోన్లు చేపలేని పరిస్థితి ఇందుకు కారణం సిలిండర్ల బుకింగ్‌కు ప్రత్యేక ఎస్ఎమ్ఎస్ విధానం అమలులో ఉండటమే..దీంతో సిలిండర్లు ఎప్పుడొస్తాయా? అని ఎదురు చూడాల్సి పరిస్థితి.కొన్ని చోట్ల గత నెలబుక్ చేసిన సిలిండర్లు ఇంకా రాలేదంటూ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొబైల్ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ రెండు పర్యాయాలు చేస్తే తప్ప..గ్యాస్ ఇంటికి చేరే పరిస్తితి లేదు. గ్యాస్ డిస్టిబ్యూటర్ల చేతివాటమో..లేక డెలివరీ బాయ్స్ జిమ్మిక్కుల్లో తెలియదు వినియోగదారుల ఇంటికి డోర్ లాక్ లేకున్నా..వంట గ్యాస్ సిలిండర్ మాత్రం సకాలంలో ఇంటికి చేరని పరిస్థితి నెలకొంది. కొన్ని సార్లు బుకింగ్ రద్దయిందని మళ్లీ బుక్ చేయమని సంక్షిప్త సందేశం వస్తుండటంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఒక్క కుటుంబానికి సంవత్సర కాలంలో 12సిలిండర్లు మంజూరు చేస్తుంది. ఇక్కడే ఏజెన్సీలు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నాయి. ఎవరైతే గ్యాస్ తక్కువ వినియోగం చేసేవారుంటారో వారి వివరాలను సేకరించి వారి పేరుమీద గ్యాస్ సిలిండర్లను ఆన్‌లైన్ బుకింగ్ చేసి ఏజెన్సీ నిర్వాహకుల వద్ద ఉంచుతున్నారు. ఎవరైనా అత్యవసరం ఉన్నవారు అడినప్పుడు బ్లాక్‌లో ఉన్నసిలిడర్‌పై అధిక మొత్తంలో తీసుకుని సరఫరా చేస్తున్నారు.సిబ్సిడి కింద వచ్చే 250 రూపాయలు వినియోగదారుడి ఖాతాలో జమ అవుతుండటంతో వారు ఏజెన్సీ వారికి వారు చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

అయితే ప్రస్తుతం ఇంటి గ్యాస్ కొరత ఉన్నా..వాణిజ్య అవసరాలకు మాత్రం సరఫరా బాగానే ఉంది. అడిగిందే తడవుగా హోటల్లకు చేరుతున్నాయి. దీన్ని బట్టి గృహ అవసరాల సిలిండర్లు దారి మళ్లుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి అవసరాలకు ఉపయోగించాల్సిన గ్యాస్ హోటళ్లు,వాణిజ్య సంస్థల అవసరాలను తీరుస్తోంది. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి మేడ్చల్ జిల్లాల్లో మూడు ప్రధాన చమురు సంస్థలకు చెందిన వాణిజ్య కనెక్షన్లు యాభై వేలకు మించి లేవు. నగరంలో పెద్ద హోటల్స్,రెస్టారెంట్లలో వాణిజ్య పరమైన సిలిండర్లు వినియోగమవుతుండగా.. చిన్నచిన్న హోటళ్లు, టిస్టాల్స్ వంటి వాటిలో మాత్రం డొమోస్టిక్ సిలిండర్లే వినియోగిస్తున్నారు. దీంతో ప్రతి రోజూ లక్షకు పైగా డొమోస్టిక్ గ్యాస్ సిలిం డర్లు దారిమల్లులతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు చిన్న సిలిడర్లలో సైతం డొమోస్టిక్ ఎల్పీజీ అక్ర మంగా రీఫిల్లింగ్ అవుతుంది.

# నిమ్స్‌లో బెడ్స్ లేవు..!

**-ఎమర్జెన్సీలో గంటల కొద్దీ నిరీక్షణ - ఓ రోగిని పంపిస్తేనే మరొకరికి బెడ్స్ దొరికే అవకాశం**

**-ఆస్పత్రిలో సమన్వయం కొరవడి పెరుగుతున్న రోగుల బాధలు - వైద్యులను కలిసేలోపు పూర్తవుతున్న సమయం**

**హైదరాబాద్,మార్చి 27 ప్రభాతవార్త**

జనగాం జిల్లా, రఘునాథపల్లి మండలం, ఇబ్రాహీంపూర్‌కు చెందిన పొన్నం కోమురయ్యకు పక్షవాతం రావడంతో నిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. బెడ్స్ ఖాళీ లేకపోవడంతో ఎమర్జెన్సీ ముందు గంటల తరబడి అక్కడే గడిపినా పడక దొరకని పరిస్థితి నెలకొంది. రోగి ఎంత సీరియస్‌గా ఉన్నా చికిత్స సంగతి పక్కన పెడితే అసలు బెడ్ దొరకడమే సమస్యగా మారింది.దీంతో తెలిసినవారి ద్వారా టిఎస్ఎంఎస్ఐడిసి ఛైర్మన్, బిఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఎట్టకేలకు వైద్యులు స్పందించి కోమురయ్యను పరీక్షించి మందులు రాసి మరో నాలుగైదు రోజులకు తిరిగి తీసుకురాండి అని చెప్పి ఇంటికి పంపించారు..

పేదల కార్పొరేట్ ఆస్పత్రిగా పేరున్న నిమ్స్‌లో వైద్య సేవల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ఆర్థోపెడిక్, కార్డియాలజీ, న్యూరాలజీ, రుమటాలజీ, యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాల్లో వైద్యం కోసం వచ్చే రోగులు ఓపి కార్డు తీసుకోవాలంటే గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించాల్సి వస్తోంది. ఇక నిమ్స్ జనరల్ ఎమర్జెన్సీకి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోజూ జిల్లాల నుంచి వచ్చే కేసులన్నీ అత్యవసరమైనవే. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు, గుండెపోటు, పక్షవాతం వచ్చిన రోగులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. వారి పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో నిమ్స్‌కే తరలిస్తారు. వీరందరికి వెంటనే పడక ఏర్పాటు చేయడం కష్టమవుతుంది. మరో వైపు కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కేసులను పెద్దగా చేర్చుకోవడం లేదు. దీంతో చాలా కేసులు నిమ్స్‌కే వస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు పడకలు దొరకడం లేదు. దీంతో అత్యవసర బ్లాక్ ముందు అంబులెన్స్‌లు, కార్లలో రోగులను తీసుకొని వచ్చి పడిగాపులు కాస్తున్నారు. గంటల కొద్దీ బాధితులు అత్యవసర బ్లాక్ ముందు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఐదు, ఆరు గంటలు గడిస్తేకానీ అక్కడ పడక దొరుకుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. రోగి ఎంత సీరియస్‌గా ఉన్నా అర్ధరాత్రి వేళ ఆసుపత్రికి వచ్చినా చికిత్స సంగతి పక్కన పెడితే అసలు బెడ్ దొరకడమే సమస్యగా మారింది. ఎంత అత్యవసర పరిస్థితుల్లో వచ్చినా ముందుగా వినిపించే మాట.. 'ఇక్కడ పడకలు లేవు" అనే. ఎమర్జెన్సీ వార్డులో ఓ రోగి ఖాళీ అయితేనే మరో రోగికి పడక దొరికే పరిస్థితి ఉంది. దీంతో రోగులను ప్రైవేటు, కార్పొరేట్ అసుపత్రులకు తరలించాల్సి వస్తుందని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు రోగి పరిస్థితి సీరియస్‌గా ఉంటే డబ్బులు సమకూర్చుకొని కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది.





నిమ్స్ జనరల్ ఎమర్జెన్సీలో పడకలు రోగుల అవసరాల మేరకు సరిపోవడం లేదు. ఈ విభాగం గ్రౌండ్ ఫ్లోరులో 40 పడకలు, మొదటి అంతస్తులో 50 పడకలు ఉన్నాయి. 18 వరకు ట్రాలీలు ఉంటాయి. అయితే అత్యవసర విభాగానికి రోజుకు రెట్టింపు సంఖ్యలో రోగులు వస్తున్నారు. ఇక్కడికి వచ్చే రోగుల పరిస్థితి బట్టి సర్జికల్, మెడికల్, క్రిటికల్, న్యూరో, కార్డియాలజీ ఇలా పలు విభాగాలకు వెంట వెంటనే తరలించాలి. అయితే కొన్నిసార్లు వ్యాధి నిర్ధారణ చేయడంలో ఆలస్యం జరుగుతుండటంతో రోగులు రెండు, మూడు రోజుల వరకు ఎమర్జెన్సీలోనే ఉండాల్సి వస్తుంది.ఇక ఆదివారం వచ్చిందంటే అంతే. దీంతో కొత్తగా వచ్చేవారికి పడకలు దొరకడం లేదు. అత్యవసర విభాగంలోనికి ప్రవేశం లభించినా ట్రాలీలోనే గంటల పాటు ఉండాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ విభాగం నుంచి ఓ రోగిని పంపిస్తేనే మరొకరికి పడక దొరికే అవకాశం ఉంటుంది.జనరల్ ఎమర్జెన్సీకి రోగులు అనేక రకాల సమస్యలతో వస్తున్నారు. వారికి ఏ వైద్యుడు చికిత్స అందించాలనే అంశం తెలవక పోవడంతో రోగులు ఒకటి రెండు రోజులు అలాగే ఉంటున్నారు. నిజానికి ఎమర్జెన్సీకి వచ్చిన రోగిని నాలుగైదు గంటల్లో సంబంధించి వార్డుకు తరలించాలి. కానీ ఆసుపత్రి వర్గాల మధ్య సమన్వయం లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇక ఓపి విభాగం పరిస్థితి అదే విధంగా ఉంది. రోగులు ఓపి కార్డు తీసుకోవాలంటే గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించాలి. అతి కష్టం మీద ఓపి కార్డు తీసుకున్నా వైద్యులను కలిసేలోపు సమయం అయిపోతుంది. దీంతో నిమ్స్‌లో వైద్య సదుపాయం పొందాలంటే గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. దీనిపై రోగుల బాధలు పట్టించుకునేవారు లేకుండా పోయారు.

# ప్రజలకు టిఎస్‌ఆర్టీసిపై గొప్ప నమ్మకం



ఏసి స్లీపర్ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ, బాజిరెడ్డి, సజ్జనార్ తదితరులు

**మన్సూరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేయడంలో టిఎస్‌ఆర్టీసి గొప్ప నమ్మకాన్ని చూరగొన్నాయని, సంస్థను లాభాలబాటలో నడిపించడానికి వినూత్న పద్ధతులను ప్రవేశపెడుతూ ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకుంటున్నామని అందుకు టిఎస్‌ఆర్టీసి సంస్థలోని ప్రతి ఉద్యోగి సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రయాణీకుల సౌకర్యార్థం అత్యాధునిక హంగులతో కొత్తగా అందుబాటులోకి వచ్చిన లహరి ఏసి స్లీపర్ బస్సులను హైద్రాబాద్‌లోని ఎల్‌బినగర్ చౌరస్తాలో సోమవారం ఆర్టీసి ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో పాటు సంస్థ ఎండి సజ్జనార్‌తో కలిసి మంత్రి పువ్వాడ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టిఎస్ ఆర్టీసి అత్యాధునిక హంగులతో కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామన్నారు.ప్రైవేటు బస్సులను ధీటుగా స్లీపర్ బస్సులలో కొత్త టెక్నాలజీతో అమ్మఒడి అనుభూతి అనే ట్యాగ్‌లైన్‌తో ఈ ఏసి స్లీపర్ బస్సులను అందుబాటులోకి తెచ్చామన్నారు.త్వరలోనే ఎలక్ట్రిక్ బస్సులను సైతం నగరంలో ప్రారంభిస్తామని వీటిని ప్రజలు ఆదరించి సహకారాలు అందించాలని ఆయన కోరారు. ప్రస్తుతం ఆక్యుపెన్సీ 69 శాతం ఉందని, వాటిని పెంచడానికి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా ఆర్టీసీ సంస్థను లాభాల బాటలో ప్రయాణించే విధంగా ఎండి సజ్జనార్ కృషి అభినందనీయమన్నారు. హైద్రాబాద్ నగరంలో మెట్రోకు ఆర్టీసీ బస్సులకు అనుసంధానం చేసి ప్రయాణీకులను ఆకర్షించాలని ఆయన కోరారు. సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ ప్రయాణీకుల సౌకర్యార్థం రాష్ట్రంలో తొలిసారిగా ఏసి స్లీపర్ బస్సులను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రయాణీకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బస్సుల్లో ట్రాకింగ్ సిస్టంతో పాటు పానిక్ బటన్‌సదుపాయాన్ని కల్పించామన్నారు. ప్రజల సంక్షేమం కోసమే ప్రజా రవాణా వ్యవస్థ ఉందని, టిఎస్‌ఆర్టీసీ లాభాల బాట పట్టేందుకు ప్రతి పౌరుడు సహకరించాలని ఆయన కోరారు. టిఎస్‌ఆర్టీసి ఎండి సజ్జనార్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాలకు వెళ్లే వారి కోసం ఏసి స్లీపర్ బస్సులను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పర్యావరణ హితం కోసం ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకోచ్చామన్నారు.తొలిసారిగా హైద్రాబాద్ నుండి విజయవాడ మార్గంలో 50 ఎలక్ట్రిక్ ఏసి బస్సులు త్వరలో వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిఓఓ డాక్టర్ వి. రవీందర్, జాయింట్ డైరక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, జోనల్ కమీషనర్ పంకజ, డిసిపి సాయిశ్రీ, నట్రాఫిక్ డిసిపి శ్రీనివాస్, హయత్‌నగర్ డిసి మారుతీ దివాకర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహరెడ్డి, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్టు మెట్రో కోసం భూసామర్థ్య పరీక్షలు



ఎయిర్‌పోర్టు మెట్రో పిల్లర్ల నిర్మాణం కోసం భూసామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త**

ఎయిర్‌పోర్టు మెట్రో కోసం భూసామర్థ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఐకియా జంక్షన్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు చేపట్టబోయే 100 మెట్రో పిల్లర్లు నమూనాగా తీసుకొని సాయిల్ టెస్టింగ్ చేపడుతున్నారు.ఈ మెట్రో ప్రాజెక్టు కోసం అలైన్‌మెంట్ స్థిరీకరణ, పెగ్ మార్కింగ్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి.సాయిల్ టెస్టింగ్ పనులు పూర్తికావడానికి సుమారు రెండు నెలల సమయం పట్టవచ్చని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ సంస్థ ఎండి ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. మెట్రో స్తంభాల నిర్మాణం ప్రతిపాదించిన ప్రతి చోట భూమి ఉపరితలం నుండి సుమారు 40 అడుగుల లోతు వరకు త్రవ్వకం జరుగుతుందన్నారు.ఈ పరీక్షలు నిర్వహించడం వల్ల స్తంభాల పునాదులు ఏ మేరకు త్రవ్వాలి. ఓపెన్ ఫౌండేషన్ లేదా పైల్ ఫౌండేషన్ నిర్ణయం, అనుమతించదగిన బేరింగ్ ప్రెజర్ తదితర విషయాలు తేటతెల్లమవుతాయని ఆయన అన్నారు. సాయిల్ టెస్టింగ్‌లు నిర్వహించడం వల్ల టెండర్ ప్రక్రియలో పాల్గొనే బిడ్డర్లకు కూడా ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగే భూమి తీరుపై ఒక అవగాహన కలుగుతుందని, అలాగే టెండర్లల్లో పాల్గొనే సమయంలో తగిన ఆర్థిక అంచనాలు రూపొందించుకోవడంలో కూడా ఈ పరీక్షలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ పరీక్షల మార్గంలో ట్రాఫిక్ నియంత్రణ, దృఢమైన బారికేడింగ్, తదితర అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. అలాగే జిహెచ్ఎంసి, వాటర్ బోర్డు, ట్రాఫిక్ పోలీస్ తదితర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఎయిర్‌పోర్టు మెట్రో ముందస్తు పనులు చురుకుగా చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ బి.ఆనంద్‌మోహన్, సూపరింటెండెంట్ ఇంజనీర్ సాయపరెడ్డి నేతృత్వంలోని మెట్రో ఇంజనీరింగ్ బృందం సాయిల్డ్ టెస్ట్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

## నాలుగు నెలలైనా సమస్య పరిష్కరించలేదు

### -ట్రాన్స్‌కో,జెన్‌కోలో రివర్షన్ పొందిన ఇంజనీర్ల ఆవేదన

**హైదరాబాద్, మార్చి 27,ప్రభాతవార్త:** ఏతప్పు చేయకపోయినా ట్రాన్స్‌కో,జెన్‌కోలో ఉద్యోగులకు రివర్షన్ ఇచ్చి అన్యాయం చేశారని రివర్షన్ పొందిన ఇంజనీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం విద్యుత్ సౌధలో సమావేశం నిర్వహించి అనంతరం మీడియాతో మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరిస్తామని యాజమాన్యం చెప్పి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు తమకు ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 6ఏళ్ళు శ్రమించి 24గంటల విద్యుత్ సరఫరాలో భాగమైన విద్యుత్ ఉద్యోగులకు ఇచ్చిన ప్రమోషన్లు వెనక్కి తీసుకోవడం మానసిక ఆందోళనకు గురవుతున్నామన్నారు. గత 4నెలలుగా తమ సమస్యల పరిష్కారం కోసం మంత్రుల, మేనేజ్‌మెంట్‌కు వినతిపత్రాలు సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా రివర్షన్ ఉద్యోగులకు న్యాయం చేయాలని తమ సమస్యల పరిష్కారం కోసం రివైజుడ్ ఇంజనీర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పెట్టి పోరాడుతామన్నారు. ఈకార్యక్రమంలో రివర్షన్ పొందిన ఇంజనీర్లు డి.బాలాజీ, రమేష్‌భాబు, శ్రావణ్‌కుమార్, ప్రవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో రివర్షన్ పొందిన ఇంజనీర్లు

# కృష్ణ నగర్‌లో దారుణం

**-చెత్త సేకరించే ఆటో కింద పడి బాలుడు రజాక్ మృతి**

**-ఆటో రివర్స్ తీసుకునే సమయంలో జరిగిన సంఘటన**

**-సిసి కెమెరాలో రికార్డ్ అయిన దృశ్యాలు**

**-కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న మల్కాజిగిరి పోలీసులు**

**మల్కాజ్‌గిరి, మార్చి 27 ప్రభాతవార్త :**



మృతి చెందిన చిన్నారి రజాక్ అహ్మద్ (ఫైల్ ఫోటో)

చెత్త బండీ చక్రాల కింద పడి చిన్నారి నలిగిపోయి మరణించిన సంఘటన మల్కాజ్‌గిరిలో చోటు చేసుకుంది. మౌలాలి డివిజన్ ఆర్టీసీ కాలనీలో చెత్త సేకరించే ఆటో కింద పడి మహ్మద్ జీఫాన్ కుమారుడు మహ్మద్ రజాక్ అహ్మద్ (16 నెలల చిన్నారి) మృతి చెందాడు. చెత్త సేకరించే ఆటో ఆగి ఉండగా వెనక నుంచి వచ్చిన చిన్నారి ఆటో కింద పడింది. ఆటో ఒక్కసారిగా వెనకాల ఉన్న చిన్నారి మీదకు ఎక్కింది. ఆటో డ్రైవర్ ఈ విషయం గమనించే లోపే చిన్నారి ప్రాణలు కోల్పోయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమ్తిం చిన్నారి మృతదేహాన్ని గాంధీకి త రలించారు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

## ఎస్ఎస్ఆర్ రేట్లు పెంచాలని సిఎండీకి వినతి

**హైదరాబాద్, మార్చి 27,ప్రభాతవార్త:** విద్యుత్‌యాజమాన్యం కాంట్రాక్టర్లకు స్టాండెర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్ (ఎస్ఎస్ఆర్ )ను పెంచాలని టిఎస్ఎస్‌పిడిసిఎల్ కాంట్రాక్టర్స్ జేఏసీ డిమాండ్ చేసింది.ఈమేరకు సోమవారం డిస్కం కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు టిఎస్ఎస్‌పిడిసిఎల్ సిఎండీ రఘుమారెడ్డిని కలిసి వనతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ ఛైర్మన్ పి.భాస్కర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్ రేట్లు 30శాతానికి పెంచాలని కోరినట్లు తెలిపారు. అలాగే ప్రమాదవశాత్తు ఎలాంటి ప్రమాదం జరిగినా దానికి వ్యవస్థ కారణమని కాంట్రాక్టర్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఈపిఎఫ్‌ను సంస్థ చెల్లించాలని కోరినట్లు తెలిపారు. తమ విన్నపాన్ని విన్న సిఎండీ సానుకూలంగా స్పందించినట్లు ఎలక్ట్రిసిటీ లైసెన్స్‌బోర్డు మాజీ సభ్యులు నక్కా యాదగిరి తెలిపారు. సిఎండీని కలిసిన వారిలో కె.మహిపాల్‌రెడ్డి, బ్రహ్మాచారి, గోవర్ధన్‌రెడ్డి, రాజు, సముద్రాల శ్రీనివాస్, కృష్ణ, నాగిరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : శ్రీధర్

**అల్వాల్, మార్చి 27 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని డిసిసి అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం వెంకటాపురంలో డివిజన్‌లో 19వ రోజు హాత్ సే హాత్ జోడో యాత్రను నందికంటి కొనసాగించారు. ఇంటింటికి వెళ్ళిన ఆయన ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పేద బలహీన మధ్య తరగతికి చెందిన ప్రజలు కాంగ్రెస్ పాలనలోనే సంతోషంగా ఉన్నారని శ్రీధర్ తెలిపారు. దేశంలో కార్పొరేట్ వర్గాలు మాత్రమే లాభ పడుతున్నాయని రైతులు శ్రామిక పేద వర్గాలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మభ్య పెడుతున్నాయని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ సంజీవ్‌కుమార్ నిమ్మ అశోక్‌రెడ్డి కృష్ణాగౌడ్ డోలి రమేష్ శివకుమార్ పవన్ మార్షల్ వీనస్ మేరి పద్మ ఆశారాణి పాల్గొన్నారు.



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి

## క్రీడా మైదానం పనులను పరిశీలించిన మేయర్

**నిజాంపేట్, మార్చి 27 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నిజాంపేట్ డంపింగ్‌యార్డు సమీపంలో క్రీడా మైదానానికి కేటాయించిన స్థలాన్ని సోమవారం మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ క్రీడా మైదాన నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, జగన్‌యాదవ్, సుదర్శన్‌రెడ్డి, ఎన్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల్లో వెలుగునింపే 'కంటివెలుగు' : వివిఎస్ఆర్

**చిక్కడపల్లి, మార్చి 27 ప్రభాతవార్త:** కంటివెలుగు కార్యక్రమం అడిక్‌మెట్ డివిజన్‌లో బిఆర్ఎస్ పార్టీ నేత నేతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆ పార్టీ రాష్ట్ర నేత, వివిఎస్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు బుజ్జి వెంకటేశ్వరరావు, సిరిగిరి శ్యామ్, కార్తీక్‌యాదవ్, అస్లమ్ భాయ్, టక్కర్ సిద్దిక్, సత్యనారాయణ, అనీల్, అరుణ్, వెంకటేష్, రాజేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. కంటి జబ్బులతో బాధపడుతున్న వారికి కంటివెలుగు కార్యక్రమం వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమం కింద ఉచితంగా శస్త్ర చికిత్సలు, అవసరమైతే కంటి అద్దాలు అందించడం జరుగుతుందని అన్నారు.

## ఆకట్టుకున్న సంస్కృతి పాఠశాల ఎక్స్‌పో

**జీడిమెట్ల, మార్చి 27 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంస్కృతి పాఠశాలలో ఎక్స్‌పో కార్యక్రమాన్ని కార్పొరేటర్ జగన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల మేధస్సుకు పదును పెడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, దాసు, గిరి, వైష్ణవి పాఠశాల చైర్మన్ నర్సింహులుగౌడ్, పాఠశాల కరెస్పాండెంట్ గడ్డమీది బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

### కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు కోసం 'విశ్వకళావైభవం'

**చిక్కడపల్లి, మార్చి 27 ప్రభాతవార్త:** కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు కోసం 'విశ్వకళావైభవం' కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా ఏప్రిల్ 16న నిర్వహించబోతున్నట్లు భారత్ ఆర్ట్స్ అకాడమ, ఏబీసీ ఫౌండేషన్ అధినేత రమణ వివరించారు. జై జవాన్ జైకిసాన్ జై.కళాకార్,ఓఆర్‌జీ, శ్రీసాయి రాజేశ్వరి ఎడ్యుకేషనల్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉంటుందని, ఏప్రిల్ 5లోగా పేర్లను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని, ఇతరవివరాలకు 7207177000 ద్వారా పొందవచ్చన్నారు. జానపద, శాస్త్రీయ, పాశ్చత్య, హిపప్, యోగా, వేదిక్ మ్యాథమెటిక్స్, మెమోరీ, అబాకస్, పెయింటింగ్, మిమిక్రి, మ్యాజిక్, వెంట్రిలాక్విజం తదితర అంశాల్లో సోలో, గ్రూపులలో పోటీలో ప్రదర్శనలుంటాయన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : లాస్య నందిత

**కంటోన్మెంట్,మార్చి 27 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న కుమార్తె లాస్య నందిత తెలిపారు. సోమవారం మోండా డివిజన్‌లోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్, జె.పి.నగర్, లోహియ నగర్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, సుబ్రమణ్య స్వామి దేవాలయం చైర్మన్ సి.సంతోష్ యాదవ్, బోయిన్‌పల్లి మార్కెట్ డైరెక్టర్లు బత్తుల నారాయణ, భాస్కర్ ముదిరాజ్, బిఆర్ఎస్ నాయకులు ఆకుల హరిక్రిష్ణ, పనస సంతోష్, సదానంద్ గౌడ్, నాగినేని సరిత, శివకుమారి, బాలనరి సింహ, పరశరామ్, నరి సింగ్, ఎస్.రాము, కోటయ్య, పిట్ల నాగేష్, కాశిరెడ్డి, జలమండలి ఇంజనీర్ శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి యాక్సిడెంట్ ఫ్రీగా మార్చేందుకు చర్యలు సజ్జనార్

**కంటోన్మెంట్, మార్చి 27 ప్రభాతవార్త:** ఆర్టీసి డ్రైవర్లు యాక్సిడెంట్ ఫ్రీ కార్పొరేషన్‌గా మారబోతుందని ఆర్టీసి సంస్థ ఎండి వి.సి.సజ్జనార్ తెలిపారు. సోమవారం సికింద్రాబాద్ జూబ్లీ బస్టేషన్‌లో ఆర్టీసి డ్రైవర్లకు ఏర్పాటు చేసిన యాక్సిడెంట్ ఫ్రీశిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు సిబ్బంది పాటుపడాలన్నారు. ఛాలెంజ్ ట్రైనింగ్ (టాక్ట్)లో భాగంగా ఏప్రిల్ నెలలో ఆర్టీసి సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లతో పాటు అన్ని విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంస్థ అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ విజిలెన్స్ సంగ్రామ్ సింగ్, ఈడి.యాదగిరి, ఛీఫ్ అపరేటింగ్ ఇంజనీర్ రవిందర్, సిపిఎం క్రిష్ణకాంత్, డైరెక్టర్ ట్రైనింగ్,యుగంధర్, ఆర్.ఎం. సి.హెచ్.వెంకన్న, డిప్యూటీ ఆర్.ఎం. అపర్ణ కళ్యాణి, కంటోన్మెంట్ డిఎం.ఎల్.రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### శ్మశానవాటిక అభివృద్ధికి కృషి : పొన్నాల రాజు

**కంటోన్మెంట్,మార్చి 27 ప్రభాతవార్త:** అడ్డగుట్ట డివిజన్‌లోని నార్తలాలాగూడ సత్య హరిశ్చంద్ర స్మశానవాటిక నూతన కమిటీ అధ్యక్షులుగా పొన్నాల రాజు,ప్రధాన కార్యదర్శిగా ఎం.సంతోష్‌కుమార్‌లను నియమించినట్లు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పొన్నాల రాజు మాట్లాడుతూ నార్తలాలాగూడలోని సత్యహరిశ్చంద్ర హిందూ స్మశానవాటికలో మంచినీరు, టాయిలెట్స్ వంటి మౌళిక సదుపాయాల మెరుగుపర్చి సుందరంగా తీర్చిదిదే ందుకు కృషి చేస్తామన్నారు.

## ప్రశాంతవాతావరణంలో పండుగలు చేసుకోవాలి

**బేగంబజార్, మార్చి 27ప్రభాతవార్త:** ప్రశాంత వాతావరణంలో ప్రజలందరు కలసి కట్టుగా పండుగలను జరుపుకోవాలని బిఆర్ఎస్ నాయకులు,జి.జి.వై.ఎఫ్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ కోరారు. ఈమేరకు సోమవారం ఎంజె మార్కెట్ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ కార్యకర్తలతోకలిసి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ శాంతి చిహ్నంగా ఆకాశంలోకి పావురాలను వదిలారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల పండుగలను కొందరు తమ స్వార్థం కొరకు ఉపయోగించుకుంటున్నట్లు ఆరోపించారు.ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బిఆర్ఎస్ నేత భీష్మ

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త :** అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మ దేవ్ అన్నారు. ఈ మేరకు సోమవారం కాచిగూడ పోలీస్‌స్టేషన్ సిఐకి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీరామ నవమి శోభాయాత్రను అణచివేయాలంటూ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌పై తప్పుడు వీడియోలను సృష్టించారని తెలిపారు.ఉద్దేశపూర్వకంగా వీడియోలను వక్రీకరించి ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారానికి దిగిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు అందించిన ఫిర్యాదులో పేర్కొన్నారు.



పోలీసులకు ఫిర్యాదుచేస్తున్న డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు భీష్మదేవ్

# కలపడమే, కలవడమే కవిసంగమం

**చిక్కడపల్లి, మార్చి 27 ప్రభాతవార్త:** మూడు తరాల కవిసంగమం సమావేశాల ద్వారా కవుల మధ్య వారధిని నిర్మించిందని వక్తలు పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో కవిసంగమం ఆధ్వర్యంలో 'కవిత్వ కూడలిగా పదకొండేళ్ల కవిసంగమం ఒక అవగాహన' కార్యక్రమం కోడూరి విజయకుమార్ అధ్యక్షతన జరిగింది. ప్రముఖ కవి యాకూబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుప్రసిద్ధ సాహితీవేత్త కె.శివారెడ్డి మాట్లాడుతూ 2012లో ఇఫ్లూలో జరిగిన మొదటి కవిసంగమం ఫెస్టివల్‌లో పాల్గొనడం జరిగిందని,ఉరకలేసే కొత్తతరపు ఉత్సాహాన్ని చూడడం జరిగిందని, ఈ కాలంలో ఎంత మంది కొత్తకవులు, కొత్త శీర్షికకర్తలు, కొత్త పుస్తకాలు, కవిసంగమం అంటే ఒక హోప్, పుష్, డ్రైవ్ అని అన్నారు. మనుషుల్ని కలిపే పని, మనుషుల్ని ఉత్సాహపరిచే పని, సృజనను ప్రోత్సహించే పని గొప్పదని, పనిచేసుకుంటూ పోవడం ఎంత గొప్పదన్నారు. దూషణభూషణలు, అభినందనలు, ఆనంద విషాదాలుంటాయని, కాలగతిలో పనిమాత్రమే మిగులుతుందని, మాటలన్నీ గాల్లో కలిసిపోతాయని, కవిసంగమం ద్వారా ఇంతమందిని సమీకరించడం ఒక సృజన కార్యక్రమం అని అన్నారు. సభలో సమకాలీన కవిత్వ తాత్వికతపై జి.లక్ష్మీనరసయ్య, అంతర్జాల కవిత్వం-కవిసంగమం పాత్రపై ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి, ప్రయోగంగా కవిసంగమం అంశంపై డాక్టర్ సీతారామ్, కవయిత్రుల కవిత్వసృజన-కవిసంగమంపై డాక్టర్ శీలాలోలిత, కవిసంగమం శీర్షికలు-కవిత్వ విమర్శ అంశంపై ఎం.నారాయణశర్మ, కొత్తకవులకు తెరిచిన కవిత్వ కిటికీ-కవిసంగమం అంశంపై అనిల్ డ్యాని, కవిత్వ కార్యక్రమాలు-ప్రచురణలు-కవిసంగమం అంశంపై అన్వర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు నిఖిలేశ్వర్, మెర్సి మార్గరేట్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రచయిత్రి హిమబిందు రచించిన 'మరోగ్రహం' పుస్తకాన్ని శివారెడ్డి ఆవిష్కరించారు.



కవిసంగమం కార్యక్రమంలో పాల్గొన్న శివారెడ్డి, యాకూబ్ తదితరులు

## హీరా గ్రూప్ సంస్థపై రాజకీయ కుట్ర

### లీగల్ అసోసియేట్ ప్రతినిధులు ఆరోపణ

**సైఫాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** హీరా గ్రూప్ సంస్థపై రాజకీయ కుట్ర జరుగుతున్నదని తమ సంస్థ సిఇఒ నౌహెరా షేక్ చట్టబద్దంగా చేస్తున్న వ్యాపారాన్ని కొందరు కుట్ర పూరితంగా ఆమెపై ఫిర్యాదు చేయడం జరిగిందని హీరా గ్రూప్ లీగల్ అసోసియేట్ ప్రతినిధులు భాస్కర్, జహ్నవి ఆరోపించారు. సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆ తప్పుడు ఫిర్యాదులపై తమ సంస్థ ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అటాచ్‌మెంట్ చేసినట్లు పేర్కొన్నారని తెలిపారు. ఈ విషయంపై న్యాయపోరాటం చేస్తున్న తమ సిఇఒ సుప్రీంకోర్టును ఈ మేరకు ఆశ్రయించడం జరిగిందన్నారు. తాము చేస్తున్న న్యాయపోరాటంలో తొలి విజయంగా ఇడి ఎటాచ్‌మెంట్‌ను ఎత్తివేయాలని సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు ఇచ్చిందని వారు చెప్పారు. సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతున్న తమ సిఇఒపై కొంతమంది కావాలని కుట్రపూరితంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారన్నారు. న్యాయ వ్యవస్థపై గౌరవంగా వ్యవహరిస్తున్న తమ సిఇఒపై ఈ విధంగా అసత్య ప్రచారాలు చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

### కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని సోమవారం కాచిగూడలోని మున్నూరు కాపు వైద్య ఆరోగ్య కేంద్రంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ ఉమారాణి ప్రారంభించారు. కంటివెలుగు శిబిరాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అందరికి కంటి పరీక్షలు చేయడంతో పాటు కళ్ళ జోళ్ళు, మందులు ఉచితంగా ఇవ్వబడతాయని, అంతేకాకుండా తగు సూచనలు, సలహాలు ఇస్తారని ఆయన చెప్పారు. పేదల కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ కంటివెలుగు కార్యక్రమాని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరం ఇన్‌ఛార్జి డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ 15 రోజులపాటు ఈ శిబిరం కొనసాగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ డాక్టర్-డాక్టర్ మాధవి, ఆప్టోమెట్రిస్ట్ రాజుసతీష్, డిఈఓ అమీన్, ఎఎన్ఎం సునీత, ఆశా వర్కర్లు సబితా, ఉమాదేవి, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఆనంద్‌కుమార్‌గౌడ్

**అఫ్జల్‌గంజ్, మార్చి 27 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు గాను తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు.సోమవారం ఆయన జాంబాగ్ డివిజన్ పరిధిలోని కట్టెలమండి,అబిడ్స్,హిందీమిలాప్‌లైన్ తదితరప్రాంతాలల్లో జలమండలి అధికారులతో కలిసి పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల కుంగిపోయిన డ్రైనేజీ కనిపించడంతో వాటిని రోడ్డుకు సమాంతరంగా ఏర్పాటు చేయాలని జలమండలి అధికారులకు సూచించారు.బోరింగ్ మోటర్‌కు మరమ్మతులు చేయించాలని కోరారు.ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జాంబాగ్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.నంద్‌కుమార్, కట్టెలమండి బస్తీఅధ్యక్షులు రాజ్‌కుమార్, దిరాజ్‌కుమార్ జైస్వాల్, బాబురావు, వివేక్ జైస్వాల్, పూనమ్ చత్వాల్ తదితరులు పాల్గొన్నారు.

### సిసి రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని రహెత్‌నగర్‌లో 15 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా వేయనున్న సిసి రోడ్డు నిర్మాణపు పనులను సోమవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలు ఏలాంటి ఇబ్బందులకు గురికాకుండా త్వరితగతిన రోడ్డు నిర్మాణం పనిని పూర్తి చేయాలని, వర్షం వస్తే నీరు సక్రమంగా వెళ్ళేలా నిర్మాణం ఉండాలని సూచించారు. అలాగే పుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆధికారులకు ఆయన ఆదేశాలు చేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### ప్రధాని మోదీ దిష్టిబొమ్మకు ఉరితో ఊరేగింపు

**సైఫాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** కేంద్రం ఎఐసిసి నేత రాహుల్‌గాంధీకి లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసినందుకు నిరసనగా నిజాం కళాశాలకు చెందిన ఆనేక మంది ఎన్ఎస్‌యుఐ విద్యార్థులు సోమవారం బషీర్‌బాగ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మకు ఉరి బిగించి ఊరేగించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు నిఖిల్‌సాయి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తప్పులను రాహుల్‌గాంధీ పార్లమెంట్ లోపల,బయట బట్టబయలు చేస్తున్నందుకు ఆయనకు లోక్‌సభలో సభ్యత్వాన్ని రద్దుచేసి ప్రజాస్వామ్య మనుగడకు మచ్చ తెచ్చిందని ఆరోపించారు. తక్షణమే లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### అంగన్‌వాడీ టీచర్ రోడ్డు ప్రమాదంలో మృతి..

#### ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

సైఫాబాద్, మార్చి 26 ప్రభాతవార్త: చలో ఢిల్లీ కార్యక్రమానికి బయలుదేరి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అంగన్‌వాడీ టీచర్ మంగ కుటుంబానికి 50 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు పి.ప్రేమ్‌పావని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ప్రాజెక్టు ఇబ్రహింపట్నం అచ్చక్కపేట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ మంగ ఈ నెల 28న స్కిం వర్కర్ల సమస్యలు పరిష్కారం కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించబోయే చలో పార్లమెంట్ కార్యక్రమానికి బయలుదేరగా సోమవారం తెల్లవారుఝామును జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందడం పట్ల ప్రగాడ సంతాపాన్ని, తీవ్ర దిగ్భ్రాంతిని ఆమె వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాలుగా ఆమె అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నదని ఆమె కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రేమ్‌పావని కోరారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

**మెహిదీపట్నం, మార్చి 27, ప్రభాతవార్త :** ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే సురక్షితంగా ప్రయాణించగలుగుతారని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అసిస్టెంట్ కమిషనర్ జి.శంకర్‌రాజు తెలిపారు. హుమాయూన్‌నగర్ పోలీస్,ఆసీఫ్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలోని విద్యార్థిని, విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు ట్రాఫిక్ నియమాళిపై పలు సూచనలు చేశారు. అనంతరం జి.శంకర్‌రాజు మాట్లాడుతూ..ఎవరైనా వాహనాలను నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడకూడదని, రాంగ్‌రూట్‌లో..స్టాప్‌లైన్ దాటరాదని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించాలని, పాదాచారులు జీబ్రాక్రాసింగ్ వద్ద మాత్రమే దోడ్డును దాటాలని, అప్పుడే ప్రమాదాలు జరగవన్నారు. ఇష్టానుసారంగా పాదచారులు రోడ్డును దాటితే ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. హుమాయూన్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, ఆసీఫ్‌నగర్ ట్రాఫిక్ సీఐ రామ్‌ప్రసాద్, ఎస్ఐ రాజు, సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. శ్రీనివాస్, వినోద్, గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతిష్యపండితులకు పురస్కారాలు అందిస్తున్న తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

## జ్యోతిష్య శాస్త్రం సనాతన ధర్మానికి ప్రతీక

### -తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

***చిక్కడపల్లి, మార్చి 27 ప్రభాతవార్త:*** జ్యోతిష్య శాస్త్రం సనాతన ధర్మానికి ప్రతీకలుగా నిలుస్తాయని తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మోహన్ ట్రస్ట్ అధినేత పిఎంకె.గాంధీ ఆధ్వర్యంలో తెలుగు ఉగాది సంబరాలు-2023 కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో తెలుగు ఉగాది జాతీయ పురస్కారాలు-2023 ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా సిరికొండ మధుసూదనాచారి హాజరై ఈ పురస్కారాలను అందించి గౌరవించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సుకు డాక్టర్ ఎన్.మహేష్‌చంద్ర భరద్వాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ అవసరాల ప్రసాదశర్మ, డాక్టర్ సుమన్‌శర్మ, డాక్టర్ రమణి శ్రీనివాస్, డాక్టర్ ఎన్.కృష్ణమాచార్యులు, డాక్టర్ కె.శ్రీహరి, డాక్టర్ కె.శివకుమార్, డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, డాక్టర్ ఎస్‌వి.నాగేశ్వరరావు తదితరులు 'మహాజ్యోతిష్య సదస్సు'లో పాల్గొన్నారు.

### తత్వగీతాలతో దళితుల వేదన అగ్రవర్ణాలపై నిరసన తెలిపన ఇద్దాను

#### -తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరీ గౌరీశంకర్

**చిక్కడపల్లి, మార్చి 27 ప్రభాతవార్త:** పంతొమ్మిదవ శతాబ్దానికి చెందిన దున్న తత్వగీతాలలో దళితుల వేదన, అగ్రవర్ణాల దూరహంకారంపై నిరసన తెలిపిన తొలి దళిత కవి అని తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరీ గౌరీశంకర్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో దున్న ఇద్దాను సంస్మరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జూలూరీ గౌరీశంకర్ మాట్లాడుతూ చైతన్యంకు చిరునామా ఐన నల్లగొండ జిల్లా వాసిగా పశువుల కాపరి వృత్తిగా జీవించిన ఇద్దాను అచల తాత్వికతతో తత్వ గీతాలలో మాయ, బ్రహ్మం, ఆత్మజ్ఞాన ప్రబోధ చేశారని వివరించారు. సమాజాన్ని సంస్కరించే దిశగా తన గీతాలతో ప్రచారం చేసిన ఇద్దాను దళితుడైన, దరిద్రుడైన, తత్వ మెరిగిన వారు జ్ఞాని అని చాటారని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సంఘసేవకురాలు ఆత్మీయ నిర్మల, గాయనీమణులు తోటశ్రీలక్ష్మి, శ్రీమణి తదితరులు పాల్గొన్నారు.

### బకాయిపడిన మూడు డిఏ, డిఆర్‌లు వెంటనే విడుదల చేయాలి

#### రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ శాఖ

**చిక్కడపల్లి, మార్చి 27 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ పెన్షనర్లకు సంబంధించి బకాయిపడిన మూడు డిఏ, డిఆర్‌లు వెంటనే విడుదల చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ శాఖ సమావేశం డిమాండ్‌చేసింది. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ శాఖ సమావేశం అధ్యక్షుడు ఎ.రాజేంద్రబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో పలు డిమాండ్లను ఆమోదించారు. నూతన వేతన సవరణ సంఘ నియామకానికి సమయం దగ్గర పడుతున్నా మొదటి పిఆర్‌సి సిఫార్సులు అమలుకు నోచుకోలేదని, ఈ ఆర్థిక సంవత్సరం మార్చి చివరి వారంలోకి ప్రవేశించామని, ఇంకా ఎప్పుడు జీవోలు విడుదల చేస్తారని సమావేశం ప్రశ్నించింది. ఉద్యోగుల, పెన్షనర్ల ఆరోగ్యపథకం(ఈహెచ్‌ఎస్) పటిష్టం చేసి అన్ని రకాల ఆసుపత్రులలో నగదురహిత చికిత్సను అందుబాటులోకి తీసుకురావాలని, అందుకు ఉద్యోగుల నుంచి 1శాతం మూలవేతనం నుంచి సేకరించాలని, పెన్షనర్లుగానీ, ఫ్యామిలీ పెన్షనర్ల కుటుంబంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకయ్యే ఖర్చును రూ.20వేల నుంచి రూ.50వేలకు పెంచాలని కోరితే పిఆర్‌సి రూ.30వేలు చేసిందని, వెంటనే జీవో విడుదల చేయాలని, 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగుల స్వచ్ఛంద పదవీ విరమణకు సిద్ధపడితే పూర్తిస్థాయిలో పెన్షన్, పెన్షనరీ ప్రయోజనాలు పొందే అవకాశం ఉండాలని పిఆర్‌సిలో పొందుపరిచిన విధంగా జీవో విడుదల చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను త్వరితగతిన ఆమోదించాలని, ఈ సమావేశంలో ముఖ్యఅతిథులుగా అఖిలభారత పెన్షనర్ల సెక్రటరీ జనరల్ సుధాకర్‌తో పాటు తెలంగాణ శాఖ సెక్రటరీ జనరల్ ఎ.వి.నర్సింగరావు, కృష్ణప్రసాద్, సూర్యనారాయణ, అంజయ్య, ఇ.నర్సింహారెడ్డి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు. ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ చేపట్టే కార్యాచరణకు సమావేశం మద్దతు ప్రకటించింది.

### కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

**అఫ్జల్‌గంజ్, మార్చి 27ప్రభాతవార్త:** చుడీబజార్ రాంమనోహర్ లోహియా కమ్యూనిటిహాల్ నిర్మాణపనులకు ప్రత్యేకనిధులను కేటాయించి, మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తి చేయించాలనిగ్రేటర్‌హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మికి మాదిగ బంధుమిత్ర సంఘం ప్రతినిధులు వెంకటేష్,రాములు వినతిపత్రం అందచేశారు.ఆమె స్పందించి నిధులను మంజూరు చేస్తానని హామి ఇచ్చినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో ఆర్.సుమన్‌కుమార్, అనిల్,నాగరాజు,జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


CLASSIFIEDS

VAARTHA CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ I, **NOOR UNNISA BINTH QADER ATHER,** Hereby Change my Name As **NOOR UNNISA** and Henceforth Called as NOOR UNNISA on All Records.

★ I, **MOHAMMED HANEEF BIN QADER ATHER,** Hereby Change my Name As **MOHAMMED HANEEF** and Henceforth Called As MOHAMMED HANEEF on All Records.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.




మైసయ్యగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## మైసయ్యగౌడ్‌కు ఘన నివాళులు

**చిక్కడపల్లి, మార్చి 27 ప్రభాతవార్త:** నమ్ముకున్న సిద్ధాంతం కోసం పనిచేసి చివరకు నక్సలైట్ల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన బడుగు, బలహీనవర్గాల నేత, బిజెపి నాయకుడు గుండగౌని మైసయ్యగౌడ్ అని వక్తలు పేర్కొన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు వద్ద స్వర్గీయ గుండగౌని మైసయ్యగౌడ్ 24వ వర్ధంతి కార్యక్రమం బిజెపి సీనియర్ నేత కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో రామ్‌నగర్ కార్పొరేటర్ రవిచారి, కోవా రాహుల్, బిజెపి నేతలు కిరణ్, గోపి, నితిన్ గౌడ్, మంగళ, భరత్‌భూషణ్, రఘువీర్, రామ్మోహన్‌గౌడ్, ఉపేందర్, రమేశ్‌గౌడ్, వాసు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మైసయ్యగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు.

## భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

**చిక్కడపల్లి, మార్చి 27 ప్రభాతవార్త:** వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీసీతారాములవారి కల్యాణం, హనుమాన్ జయంతిని పురస్కరించుకుని సోమవారం సుదర్శనహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ జి.మురళీప్రసాద్, ఈవో మూచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ టి.రామకృష్ణ, రమణ, మురికి గణేష్, పద్మ బాసాని, అర్చకులు బుగ్గాలక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి, కె.కృష్ణమూర్తి, పురుషోత్తమచారి, ఎస్‌బివిఎన్.ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు. 28న, 29న రుద్రహోమం, 30 శ్రీరామనవమి సందర్భంగా సీతారాములవారి కల్యాణం ఉంటుందన్నారు. 31న శ్రీరామపట్టాభిషేకం, ఏప్రిల్ 1న నవగ్రహ హోమం, 2న ఆదిత్యహృదయం హోమం, 3నగురు దత్తాత్రేయ దక్షిణామూర్తి రుద్ర మృత్యుంజయ హోమం, 4న హనుమత్ కార్యసిద్ధి హోమం, 5న హనుమవ్రతం, 6న హనుమాన్ జయంతి, 7న సీతారాము కళ్యాణం ఉంటుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో ఆయా కార్యక్రమాలో పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని కోరారు.

### ఇడికూడ రమాదేవికి 'ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్'

**చిక్కడపల్లి, మార్చి 27 ప్రభాతవార్త:** ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో 'మహాభారం-వ్యక్తిత్వ వికాసం' అంశంపై పరిశోధనలు చేసి సమర్పించినందుకుగాను ఇడికూడ రమాదేవికి 'ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌'ను ప్రకటించింది. యూజీసీ నెట్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు అర్హత సాధించింది. 2016లో విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ వారిజా రాణి పర్యవేక్షణలో పిహెచ్‌డిలో చేరారు. పరిశోధనలో కొనసాగుతూనే 2018లో గురుకుల టీజీటిగా, 2019లో లాంగ్వేజ్ పండిట్‌గా, గురుకుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగాలను సాధించారు. ప్రస్తుతం భువనగిరిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు.

## ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం పుష్పక్ ఏసీ బస్సులు

**కంటోన్మెంట్,మార్చి 27 ప్రభాతవార్త:** శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం జెబిఎస్‌లో అత్యాధునీక హంగులతో నిర్మించిన పాయింట్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసి మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ తెలిపారు. సోమవారం సికింద్రాబాద్ జూబ్లీ బస్టేషన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పుష్పక్ ఏసీ పాయింట్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ జెబిఎస్ నుంచి శంషాబాద్ ఏయిర్‌పోర్ట్‌కు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి 20నిమిషాలకు ఒక బస్సును రాత్రింభవళ్లు నడిపిస్తున్నామన్నారు. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా పుష్పక్ బస్సుల్లో ప్రయాణం చేసి సురక్షితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్టీసి గ్రేటర్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఇ.యాదగిరి, రీజినల్ మేనేజర్ సి.హెచ్.వెంకన్న, డిప్యూటీ ఆర్.ఎం. అపర్ణ కళ్యాణి, కంటోన్మెంట్ డిపో మేనేజర్ ఎల్.రాంమోహన్ పాల్గొన్నారు.




జెబిఎస్‌లో అన్నిహంగులతో నిర్మించిన పుష్పక్ ఏసీ బస్టాప్‌ను ప్రారంభిస్తున్న ఎండి సజ్జనార్, ఈడి.యాదగిరి, ఆర్.ఎం.వెంకన్న


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

క్ర.సం.1. నిట్ నెం. 'ఇ' ప్రకటన : 35/CTO/GHMC/2022-23 తేది: 25.03.2023
పనిపేరు: GHMC యాజమాన్యంలోని రిఫ్యూస్ కాంపాక్టర్ వాహనాలు (35నం.లు) కొరకు సమగ్ర వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్ (AMC) ఒక సంవత్సరకాలానికి పని సామర్థ్యాన్ని బట్టి, ఇంకొక రెండేళ్ళ కాలానికి పొడిగింపు చేయవచ్చును. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదిలు, సమయం: 27.03.2023 ఉ.11.00గం. ఆపైన. ముగింపు తేది: 03.04.2023 ఉ.11.00గం. అధికారి పేరు, చిరునామా సెల్ నం. చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి కార్యాలయం, 4వ అంతస్తు, GHMC, హెడ్‌ఆఫీస్, ట్యాంక్ బండ్, హైదరాబాద్. శ్రీ కె.అజయ్ CTO, GHMC. మొబైల్ నెం. 7993360314. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.eprocurement.telanagan.gov.in వద్ద చూడవచ్చును.
DIPR.No.13849-PP/CL/Advt/1/2022-23 తేదీ: 27.03.2023 సం/- చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, GHMC.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
GHMC

నిట్ నెం. : 52/EE- డివిజన్-29/SBZ/GHMC/2022-23 తేది: 25.03.2023
పనిపేరు: సికింద్రాబాద్, GHMC, డివిజన్-29, తార్నాక, శాంతినగర్‌లోని రామాలయం మందిర వీధిలో ఇం.నెం. 12-1-636/1లో గల ఖాళీస్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, అంచనా విలువ /ECV లక్షలో: 13.50. బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది/చివరి తేది మరియు సమయం: 29.03.2023న సా.4.00గం.ల నుండి 06.04.2023న సా.4.00గం.ల వరకు. సంబంధిత అధికారి పేరు, చిరునామా మరియు సెల్ నెం: ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్, డివిజన్-29, GHMC, సికింద్రాబాద్. సెల్ నెం: 9963550657. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.eprocurement.gov.in పై చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు, డివిజన్-29, సికింద్రాబాద్, GHMC.
DIPR.No.13840-PP/CL/Advt/1/2022-23 తేదీ: 27.03.2023

IN THE COURT OF THE HON'BLE V ADDL. JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT : L.B. NAGAR
O.S.No. 227 OF 2023
Between:
1) Smt. Nunna Lakshmi Sujatha
2) Kumari Poorna Manasa Nunna
3) Sri Rohith Lakshmi Narayana ...Plaintiffs
And
The Thasildhar, O/o The Saroornagar Mandal, Saroornagar, Ranga Reddy District & another ...Defendants
To,
All Concerned ...Defendant No.2
Whereas the above Plaintiffs have filed above numbered suit before the Hon'ble Court praying to declare them as the legal heirs of Late Sri N.V.Ramanamurthy, who died on 10-07-2022 and to declare the Plaintiffs as owners, possessors and successors of the plaint Schedule of Property i.e., the semi-finished Flat No.404, on Fourth Floor, in 'DOORAVANI ENCLAVE' having plinth area of 1500 Sq.feet (including common area and Balconies) along with car parking and undivided share of land admeasuring 42 Sq.yards or 35.11 Sq.Mtrs, out of 1000 Sq.yards of Plots No.11 and 12 in Survey No.9/1/G, situated at Road No.1, Telephone Colony, Saroor nagar Village and Mandal, Ranga Reddy District, the standing name of Sri N.V.Ramana murthy and to Award the costs of the suit and grant any such other relief or reliefs to what the Plaintiffs are entitled. Whereas the Hon'ble Court ordered notice by publication in New Paper, concerning public at large and whom so ever concerned this notice is published. It is hereby informed that if anybody is having objections with regard to the above prayer they may put forth their objections before the above said Hon'ble Court at 10.30 A.M. on 24.04.2023 and if objections are not received by then, the suit will be decreed according to law.
(By Order of the Court)
Sd/- S VIKRAMADITYA BABU
Advocate, High Court, Telangana State, Counsel for Plaintiffs
Flat No.102, Gangadhar Apartments, West Prasanthnagar Colony, Moosarambagh, Hyderabad-500036. Mobile No: 9440455033

IN THE COURT OF THE XXI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT: HYDERABAD.
O.S.No. 1976 of 2021
Between:
Karra Purushotham ..Plaintiff.
And
L.Sudha Rani and others ...Defendants.
To
2.Rasi Raj Kumar S/o RDD Bhagwath, 43 years, Business, R/o Zinkalwada, Bharathnagar, Sanathnagar, Hyderabad. ...Defendant No.2.
Sir,
Please take notice that the above named plaintiff filed the above case against you and others. The above case is posted to 26-4-2023 for your appearance either in person or through Advocate at 10-30 A.M. before the said court. Failing which the matter will be decided in your absence.
//BY ORDER OF THE COURT//
Sd/- YAKUB ALI, Advocate
Office at: 7-152/B, New Mettuguda Colony, Keshavnagar Colony, Mettuguda, Secunderabad-500017.
Cell No.9700724527.

## చిన్న చెరువు భూమిలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కబ్జా...

# ఎమ్మెల్యే మౌనం వెనక మర్మమేంటని కొప్పుల ప్రశ్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** మన్సూరాబాద్ చిన్న చెరువుశిఖం భూమిని సాక్షాత్తూ బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి కబ్జాకు పాల్పడి అక్రమ భవనాలు నిర్మిస్తుంటే స్థానిక ఎమ్మెల్యే మౌనం వెనక మర్మమేంటని స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ప్రశ్నించారు. మన్సూరాబాద్‌లోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన్సూరాబాద్ చిన్నచెరువు భూమితో పాటు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ పరిధిలో 2008సంవత్సరంలో స్థానికులు ఆక్రమణకు ప్రయత్నించగా అధికారులు అడ్డుకుని ఇది ప్రభుత్వభూమి అని పేర్కొంటూ కేసులు సైతం నమోదు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా 2012 సంవత్సరంలో సైతం అప్పటి తహసిల్దార్ చిన్నచెరువు చుట్టు ప్రక్కల ప్రాంతంలో ఎఫ్‌టిఎల్‌ను గుర్తించి ఇది పూర్తిగా ప్రభుత్వ భూమిగా నిర్ధారణ చేసి ప్రభుత్వానికి నివేదికలు సైతం ఇవ్వడం జరిగిందన్నారు. కానీ ఇప్పుడు మాత్రం ఈ భూమిలో స్థానికి బిఆర్ఎస్ అధ్యక్షుడు నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం అనుమానాలకు తావిస్తుందన్నారు. గత సంవత్సరంలో కూడ ఈ ప్రాంతంలో గుడిసెలు వేసుకున్న కొందరిపై కేసులు నమోదు చేయడంతో పాటు జిహెచ్ఎంసి అధికారులు గుడిసెలు తొలగించడం జరిగిందని, అదేవిధంగా బిజెపి నాయకులు శేఖర్‌జీ తన కార్యాలయం నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరితే అప్పటి అధికారులు ఇదీ పూర్తిగా ఎఫ్‌టిఎల్ పరిధిలోకి వస్తుందని చెప్పి అనుమతులను అడ్డుకున్నారని గుర్తుచేశారు. మరి ఇప్పుడు ఇదే భూమికి జక్కిడి మల్లారెడ్డి నిర్మాణాలు చేపడితే అధికారపార్టీకి చెందిన వాడని అధికారులు వంతు పాడడం సమంజం కాదన్నారు. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చిన్న చెరువు కబ్జాకు గురవుతే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. చిన్నచెరువు కబ్జాకు గురవుతుందని తాను అధికారులకు పిర్యాదులు చేస్తుంటే తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు. ఈ కబ్జా భాగోతంను విడిచిపెట్టేదిలేదని, దీని వెనక ఉన్న అధికారులను సైతం బాధ్యులను చేస్తూ పోరాటం కొనసాగిస్తామన్నారు. అధికారులు ఇప్పటికైనా తమ బాధ్యతలు గుర్తెరిగి చిన్నచెరువు కబ్జాకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రామేశ్వర్, శ్రీదర్‌గౌడ్, యాంజాల జగన్, సాయి, పారందసాయి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించండి : శ్రీవాణి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** డివిజన్లో పేరుకుపోయిన సమస్యలను వెంటనేపరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ పంకజ, ఉపకమిషనర్ హరికృష్ణయ్య, ఇంజనీరింగ్, పారిశుద్ధం విభాగం అధికారులతో డివిజన్‌లోని పెండింగ్ సమస్యలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : లచ్చిరెడ్డి



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న లచ్చిరెడ్డి

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాయత్రీనగర్‌బ్యాంక్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కాలనీవాసుల ఆహ్వానం మేరకు కార్పొరేటర్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా కాలనీలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణం, రోడ్లు, విద్యుత్ స్థంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కాలనీ అధ్యక్షురాలు సరస్వతి కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ దశలవారిగా కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రదాన కార్యదర్శి ముడుపు సందీప్‌రెడ్డి, సంక్షేమ సంఘం నాయకులు రవికుమార్, ఉపేందర్, శేఖర్, మనోహర్, బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

## చంపాపేటలో ప్రధాని దిష్టి బొమ్మ దగ్ధం



ప్రధాని దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, పార్లమెంటు సభ్యులు రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్నినిరసిస్తూ చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి ప్రధాని దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. గాంధీజీ విగ్రహం నుండి చంపాపేట చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహిస్తూ కేంద్ర ప్రభుత్వం, ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ పాదయాత్ర నిర్వహించి బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడం వల్లే, కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి లభిస్తున్న మద్దతును చూసి జీర్ణించుకోలేకే రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాతంగి యాదగిరి, మొగిలిపువ్వు నారాయణ, తోకటి కిరణ్, కారుకొండ శివ, చింటూ, జంగయ్య, వెంకటేష్, యాదమ్మ, రామకృష్ణారెడ్డి, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహాయంతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం : మంత్రి



భూమి పూజ కార్యక్రమంలో మంత్రి ఈశ్వర్, కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:**మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని నేరెడ్‌మెట్ డిఫెన్స్ కాలనీలో ఏర్పాటుచేసిన భూమి పూజ కార్యక్రమంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. అనంతరం కాలనీ అధ్వర్యంలో అయనను సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కుంటున్న పలు సమస్యలను సంబంధిత ఎమ్మెల్యేతో కలసి చర్చించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సారధి, మల్కాజిగిరి సర్కిల్ టిఆర్ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, నాయకులు కెవి రావు, జేమ్స్, చెన్నారెడ్డి, శివ, శివయ్య, రాజేష్, బంటు, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, ప్రజాసంక్షేమమే మా విజయం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 27 ప్రభాతవార్త :** ప్రజాసంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ పేదలకు అండగా నిలుస్తున్న బిఆర్ఎస్ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గంలో గులాబీజెండా ఎగరవేస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట, నాగోల్ డివిజన్లో బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్ది రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నామని తెలిపారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో పార్టీ కార్యకర్తలు భాగస్వాములు కావాలని జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గ పరిధిలో ఫ్లైఓవర్లు, అండర్ పాసులు నిర్మించి ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. ప్రతికార్యకర్త సైనికుడి వలే పార్టీ కోసం పనిచేయాలని, ఉద్యమకారులకు పార్టీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఎల్వి రమణ, బుగ్గారపు దయానంద్‌గుప్తా,నాయకులు జీవి.సాగర్‌రెడ్డి,చెరుకు సంగీత ప్రశాంత్‌గౌడ్, లింగాల నాగేశ్వర్‌రావు, రాహుల్‌గౌడ్, చిరంజీవి, ప్రకాష్‌గౌడ్, ఉదయ్‌గౌడ్, విజయగౌడ్, వరుణ్, జోగు రాములు, ప్రసాద్,సతీష్‌యాదవ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్రమబద్దీకరణకు మరో అవకాశం.. సద్వినియోగం చేసుకోండి: మంత్రి సబితారెడ్డి

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త :** ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మించుకొన్న వారికి తెలంగాణ ప్రభుత్వం క్రమబద్ధీకరణకు మరో అవకాశం కల్పించిందని రాష్ట్ర విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెల గూడ ఆర్‌సిఐ రోడ్డులోనున్న మంత్రి క్యాంపు కార్యాలయంలో సబితారెడ్డి రెవెన్యూ అధికారులతో జిఓ 58, 59లకు సంబంధించి ప్రత్యేక సమక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మించుకున్న వారు సదరు జివోలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2020 జూన్ 2 వరకు ఇళ్ల నిర్మించుక్ను వారందరికీ ఈ సారి ప్రభుత్వం వెసులు బాటు కల్పించి క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిందని ఆమె వివరించారు. అర్హులైన వారు ఏప్రిల్ 1వ తేదీ నుండి 30వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సూరజ్ కుమార్, ఎమ్మార్వోలు జనార్థన్‌రావు, మహేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ సొసైటీలో డిపాజిట్లు పెంచాలి: మర్రి నర్సింహారెడ్డి

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న భాగ్యనగర్ సొసైటీలో డిపాజిట్లు పెంచాలని ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. నాదర్‌గుల్‌లోని సొసైటీ కార్యాలయంలో ఛైర్మన్ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సొసైటీ రూ.4 కోట్లకు పైగా లాభాల్లో ఉందనీ అయితే సంఘంలో డిపాజిట్లు పెరిగే విధంగా అందరూ సహకరించాలని కోరారు. రైతులకు పంట రుణాలతో పాటు వ్యాపారులకు సైతం రుణాలు ఇస్తున్నామని ఆయన వివరించారు. సొసైటీ అభివృద్ధికి సహకరిస్తున్న డైరెక్టర్లకు, అధికారులకు, రైతులకు, ఖాతాదారులకు, సిబ్బందికి నర్సింహారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ బంగారు బాబు, డైరెక్టర్లు, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ తొలగింపును అడ్డుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త :** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహ తొలగింపును ఎమ్మార్పీఎస్ నాయకులు అడ్డుకున్నారు. సోమవారం విగ్రహాన్ని తొలించడానికి వచ్చి కార్పొరేషన్ అధికారులను సిబ్బందిని అడ్డుకొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. చౌరస్తాలో ఉన్న చిన్న విగ్రహాన్ని తొలగించి పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని కార్పొరేషన్ అధికారులు కల్లబొల్లి మాటలు చెప్పినా తాము విశ్వసించడంలేదని స్పష్టం చేశారు. కనీసం దళిత నాయకులకు, ఎమ్మార్పీఎస్ నేతలకు సమాచారం ఇవ్వకుండా ఎలా తొలగించే ప్రయత్నం చేస్తారని నిలదీశారు. విగ్రహాన్ని తొలగిస్తే ఆందోళన చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొంగరి నర్సింహ, నీరుడు శ్రీరాములు, విజయ్, ఆనంద్, చిన్న, రఘు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్‌లో చలివేంద్రం ప్రారంభం

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మల్లాపూర్‌లో బిజెపి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. స్థానిక బిజెపి నాయకులు ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరికుప్పల వెంకటేష్, టేకుల భాస్కర్‌రెడ్డి, ఈశ్వర్, రవి, గోపాల్, నర్సింహ, అంజయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ వెంట దేశ ప్రజలు ఉన్నారు: కాంగ్రెస్



గాంధీ విగ్రహ వద్ద దీక్ష చేస్తున్న నర్సింహారెడ్డి, అమరేందర్‌రెడ్డి, మేయర్ పారిజాత, దేప భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేసినందుకు నిరసనగా సోమవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ సంద చెరువు కట్టపై రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిఆధ్వర్యంలో సత్యాగ్రహ-సంకల్ప దీక్షను నిర్వహించారు. చెరువు కట్టపై ఉన్న గాంధీ విగ్రహం ఎదుట ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ అగ్ర నేతలు, పార్టీ శ్రేణులు హాజరయ్యారు. చల్లా అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న టిపిసిసి ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి, చేవెళ్ళ పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి వేం నరేందర్‌రెడ్డి, అధికార ప్రతినిధి సంకేపల్లి సుధీర్‌రెడ్డి,టిపిసిసికార్యదర్శి యెల్మేటి అమరేందర్ రెడ్డి, టిపిసిసిప్రధానకార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి,ఎల్‌బినగర్ కాంగ్రెస్ ఇంఛార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి, మిద్దెల జితేందర్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఇసి శేఖర్‌గౌడ్ తదితరులు రాహుల్‌పై అనర్హత వేటు వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాహుల్ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడం ప్రజాస్వామ్యంలో చీకటి రోజన్నారు. మోడీ ప్రభుత్వం నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తున్న దేశ ప్రజలు రాహుల్‌కు అండగా నిలబడుతున్నారని వారు పేర్కొన్నారు.

## సిఎం కెసిఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష : మంత్రి సబితారెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న మంత్రి సబితారెడ్డి

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్ రైతుబజార్ సమీపంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర విద్యాశాఖమంత్రి పి.సబితాఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రానికి సిఎం కెసిఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించి ప్రజలకు చేరువ కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, జిల్లా ఇంఛార్జి ఎల్.రమణ, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శ్రీధర్, మీర్‌పేట్ మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, పార్టీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, నియోజకవర్గ పార్టీ ఉపాధ్యక్షుడు నిమ్మల నరేందర్‌గౌడ్, మీర్‌పేట్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ, అనుబంధ శ్రేణుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేగళ్లకు సతీష్‌కు నంది అవార్డు



రేగళ్లకు నంది అవార్డు అందిస్తున్న సముద్రాల

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త :** ప్రజాసేవకే తన జీవితం అంకితం చేశానని తెలంగాణ ఉద్యమ నేత ఆధ్యాత్మిక చింతనుడు రేగళ్ల సతీష్ రెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ శ్రీ సాయిమల అయ్యప్పఆలయ ఛైర్మన్ తెలంగాణ ఉద్యమ నేత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు కళానిలయం సంస్థ ఆధ్వర్యంలో ఆయనకు ఉగాది నందిఅవార్డును రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ సముద్రాల, వేణుగోపాలాచార్యులు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మల చేతులమీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ వెల్లంకి కృష్ణ జ్యోతిష్య వేద పండితులు, ప్రముఖ సినీ నటి జయలక్ష్మి, సినీ గేయ రచయిత రాంబాబు గోపాల పాల్గొన్నారు. కళానిలయం నిర్వాహకులు పుష్పలత సురేంద్రలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల సమస్యలను పరిష్కరించాలని బిజెపి నాయకుల వినతి



వినతి పత్రం అందిస్తున్న బీజెపి పార్టీ నాయకులు..

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త :** జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నివసిస్తున్న పేద ప్రజలపై ప్రభుత్వం అడ్డగోలుగా పన్నులు, నల్లా కనెక్షన్, విద్యుత్ వసూలు చేస్తూ చెల్లించని వారి కనెక్షన్లకు కట్ చేస్తామని చెప్పండం సరైంది కాదని జవహర్‌నగర్ మున్సిపల్ బీజెపి అధ్యక్షులు రంగుల శంకర్ పేర్కొన్నారు. సోమవారం బీజెపి నాయకులతో కలసి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జవహర్‌నగర్‌లో నివసిస్తున్న పేద ప్రజలకు ఇల్లు కట్టుకోవడానికి అనుమతులు లేవు, ఇల్లు కొనుగోలు చేసిన వారినుండి పన్నుల రూపంలో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ వారిని ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందన్నారు. డంపింగ్ యార్డు కారణంగా అక్కడి ప్రజలు వింత రోగాల బారిన పడుతున్న ప్రభుత్వం మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజెపి నాయకులు కమల్, సునీల్, రాము, రాఘవేంద్ర చారి, శివకేశవ్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు



లబ్దిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్లు గీత, శ్రీవాణి, శాంతి, దేవేందర్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** తెలంగాణలో ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి పథకం వరంలాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ మండల పరిధిలోని ఉప్పల్, చిలుకానగర్, నాచారం, రామంతాపూర్,మల్లాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఆడబిడ్డలకు సిఎం కెసిఆర్ ఒక పెద్దన్నలాగా వ్యవహరిస్తున్నారన్నారు. తహసీల్దార్ కె.గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ ఉప్పల్ మండల పరిధిలో సోమవారం 81 మంది లబ్దిదారులకు చెక్‌లు అందజేసినట్లు తెలిపారు. చెక్కులు మంజూరైన ప్రతి ఒక్కరు మండల కార్యాలయానికి వచ్చి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ రఫీయుద్దీన్, ఆర్ఐ సుధ, రెవెన్యూ సిబ్బంది అనంతరాములు, నాగలక్ష్మి, నరేందర్, సంజీవ, సుమన్; బిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, బన్నాల ప్రవీణ్, గరిక సుధాకర్, ముత్యంరెడ్డి, వేముల సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యాన్ని పాటిస్తూ కలసికట్టుగా పండుగలు జరుపుకోవాలి



శాంతికమిటీ సమావేశంలో ఇన్‌స్పెక్టర్‌తో కార్పొరేటర్లు, పెద్దలు

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** ప్రజలంతా కులమతాలకతీతంగా అన్ని పండుగలను కలిసికట్టుగా సంతోషంగా జరుపుకోవాలని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్ల కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. శ్రీరామనవమి, హనుమాన్‌జయంతి, రంజాన్ ఉపవాస దీక్షలు ఒకే సారివస్తున్న నేపథ్యంలో శాంతి భద్రతకు ఎలాంటి విఘాతం కలుగకుండా హయత్‌నగర్ పట్టణ పెద్దలతో పోలీసులు సోమవారం శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు హయత్‌నగర్ పట్టణంలో ఎలాంటి కుల, మతఘర్షణలు జరుగలేదన్నారు. హిందూ, ముస్లింలంతా సోదరభావంతో అన్ని పండుగలను కలిసే జరుపుకుంటున్నారని, ఇక ముందు కూడా అదే స్నేహభావంతో మెలగాలని వారు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉగాది ఎల్లప్ప, గోవిందాచారి, కడారి యాదగిరి, సతీష్, ప్రేమ్, మహేష్ పాల్గొన్నారు.

**గ్రంథాలయంలో మౌళిక వసతుల పరిశీలన...** హయత్‌నగర్‌లోని శాఖాగ్రంథాలయాన్ని కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి సందర్శించి మౌళికవసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఇంఛార్జి సత్యనారాయణ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే తన స్వంత నిధులతో విద్యుత్‌దీపాలు, ఫ్యాన్లను ఏర్పాటు చేస్తానని హామీనిచ్చారు.

## డెబ్రిస్‌ను రోడ్ల పక్కన వేయవద్దు



డెబ్రిస్ తొలగింపును పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ అరుణ

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** డెబ్రిస్‌ను రోడ్ల పక్కన వేయకుండా కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తగిన చొరవ తీసుకోవాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. వెంకటాద్రినగర్‌లోని డెబ్రిస్ తొలగింపును పర్యవేక్షించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్ల పక్కన డెబ్రిస్‌ను ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణకుమార్, దేవేందర్, మంజుల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి సాయిబాబా దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలు

**ఎల్.బి.నగర్, మార్చి 27 ప్రభాతవార్త :** దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయిబాబా దేవాలయంలో శ్రీరామనవమి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయం కమిటీ ఛైర్మన్ గుండా మల్లయ్య తెలిపారు. 29వ తేదీ బుధవారం నుంచి 31వ తేదీ శుక్రవారం వరకు దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 30వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## ఏపిఏయు కాలనీలో కొనసాగుతున్న ఘనంగా శ్రీరామ నవమి ఉత్సవాలు

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ ఏపిఏయు కాలనీలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాముల వారిని, సీతమ్మ వారిని పెళ్లికొడుకు, పెళ్లికూతురును గావించారు. దేవతామూర్తులను నగర సంకీర్తనతో కాలనీ పురవీదుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉగాది నుంచి శ్రీరామ నవమి వరకు నవరాత్రి ఉత్సవాలను ఏపిఏయు కాలనీలో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబిసి మోర్చా మీడియా ప్రతినిధి లింగాల హరిగౌడ్, కాలనీ అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, జిట్ట సురేందర్‌రెడ్డి, రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కుర్మల్‌గూడలో ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణి

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని కుర్మల్‌గూడలో ఆయుష్మాన్ భారత్ బీమా కార్డుల పంపిణీ జరిగింది. బిజెపి లీగల్ సెల్ కన్వీనర్ టేకుల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టేకుల మల్లారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాసబ్ చెరువుని కాపాడండి : వైస్ ఛైర్‌పర్సన్ హరితధనరాజ్‌గౌడ్



మాసబ్ చెరువును సందర్శించిన హరితధనరాజ్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త :** మసాబ్‌చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలోపల మట్టి పోసిన కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పోసిన మట్టిని ఎత్తివేసి, వెంటనే శాటిలైట్ సర్వేచేసి ఎఫ్‌టిఎల్ హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని మాసాబ్ చెరువును సందర్శించిన వైస్ ఛైర్ పర్సన్ గుండ్లపల్లి హరితధనరాజ్‌గౌడ్, కౌన్సిలర్లు, నాయకులతో కలిసి డిమాండ్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాసాభ్ చేరువలో ఉన్న ఎఫ్‌టిఎల్ హద్దురాళ్ల లోపల ప్రక్కనే ఉన్న రియల్ఎస్టేట్ వాళ్లు వందల కోట్ల రూపాయలు విలువకలిగిన చెరువుల్లో నీళ్ళు ఉండగానే ట్రాక్టర్లతో బయటనుంచి మట్టి తీసుకొచ్చి చెరువులో ఎలా నింపుతారని ప్రశ్నించారు. చెరువును మట్టిని నింపినవారిపై అధికారులు, ఆర్‌డిఓ, ఎమ్మార్వో చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడల్సిన కనీసబాధ్యత లేదాని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే చర్యలు చేపట్టి శాటిలైట్ సర్వే చేసి హద్దురాళ్లు ఏర్పాటుచేయాలని సూచించారు. చెరువులో మట్టి పోసిన వారిపై ల్యాండ్ గ్రామింగ్ కేసులు పెట్టి అరెస్టు చేయాలని హెచ్చరించారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ నాయకులతోకలిసి పెద్దఎత్తున సాగర్ రహదారిపై ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు కాకుమాను సునీల్, కౌన్సిలర్లు కంబలపల్లి ధనరాజ్, బండారి బాలరాజ్, నారని కవితశేఖర్‌గౌడ్, మేతరి అనురాధ దర్శన్, నాయకులు డాక్టర్ రాగ్యనాయక్, పున్నం శ్రీనివాస్‌నేత, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యంగౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం సమంజసం కాదు



దీక్ష నిర్వహిస్తున్న అంజన్‌కుమార్, చెకోలేకర్ తదితరులు

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త :** దేశం కోనం ప్రాణాలు అర్పించిన చరిత్ర రాహుల్‌గాంధీ కుటుంబానిదని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. పార్టీ పిలుపుమేరకు టిపిసిసిప్రధానకార్యదర్శి, మలక్‌పేట ఇంఛార్జి చేకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం మూసారంబాగ్ చౌరస్తాలో చేపట్టిన 'సంకల్ప్ సత్యాగ్రహ' దీక్ష టిపిసిసి ఉపాధ్యక్షులు శ్యామల కిరణ్‌రెడ్డి, నిరంజన్, మాజీ మంత్రి పుష్ప లీల, సీనియర్‌నేత ఫిరోజ్‌ఖాన్, హైద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు సమీరుల్లాహ హక్, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హర్షద్‌లు హాజరయ్యారు. అంతకుముందు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం అందజేశారు. నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ నందర్భంగా నాయకులు మాట్లాడుతూ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ హయంలో పేదల నంక్షేమం కోనం ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. స్వాతంత్య ఉద్యమంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాల్గొన్న దాఖాలాలు లేవన్నారు. రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్‌జోడో యాత్రకు ప్రజల నుంచి వచ్చిన విశేష ఆదరణ చూసి తట్టుకోలేక బిజెపి అణిచివేతలకు పాల్పడుతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టడానికి ప్రజలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మదన్‌బాబు, లింగాల శ్రీనివాస్, మహేష్, భాస్కర్, సాయిరాం, రాజేష్, సూర్యప్రకాష్, రక్షిత్, మనీష్, అనురిధ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.34లక్షలతో మంచినీటి పైప్‌లైన్లు : ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి, శ్రీవాణి

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** రామంతాపూర్ భగాయత్ సాయికృష్ణకాలనీలో రూ.34లక్షల వ్యయంతో చేపడుతున్న సివరేజీ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రామంతాపూర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని, భగాయత్ పరిధిలోని ప్రజలకు మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్పొరేటర్ బండారు శ్రీవాణి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి జిఎం సంతోష్‌కుమార్, డిజిఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ పల్లె రవీందర్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్స్ సంక్షేమానికి కృషి : భరత్‌రెడ్డి



మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న భరత్‌రెడ్డి, వినయ్‌కుమార్

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** పెన్షనర్స్‌కు ఎల్లవేళలా అందుబాటులోఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.భరత్‌రెడ్డి పేర్కొన్నారు. మలక్‌పేట సలీంనగర్‌లోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ వార్షిక సర్వ సభ్య సమావేశం చైతన్యపురి సాయినగర్‌లోని సీనియర్ సిటిజన్స్ సేవా సమితిలో దిగ్విజయంగా జరిగింది. అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రగతిఅభివృద్ధి తదితర విషయాల గురించి అధ్యక్షుడు భరత్‌రెడ్డి వివరించారు. అనంతరం 25వ త్రైమాసిక పెన్షనర్స్ మ్యాగజైన్ సూచికను సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. గోల్డెన్‌జూబ్లీ పూర్తి చేసుకున్న పెన్షనర్ల దంపతులను ఘనంగా సన్మానించి సత్కార పత్రం, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాదరావు, వినోద్‌కుమార్, మదన్‌మోహన్ రావు, లింగారెడ్డి, సీతారాం, సలీం, సభ్యులు పాల్గొన్నారు.